క్లుప్తంగా

ఐసెట్‌లో నలంద విద్యార్థుల ప్రతిభ

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఐసెట్–2024 ఫలితాలు గురువారం ప్రకటించగా నలంద డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకు సాధించినట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ అనురాధ తెలిపారు. తమ విద్యార్థి ఆర్.ప్రభాత్ 382వ ర్యాంకు, యు.వి. రఘువర్మ 651వ ర్యాంకు సాధించగా 5 వేలు లోపు 8 మంది, 12 వేలు లోపు 42 మంది ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. అత్యుత్తమ ర్యాంకులు పొందిన వారిని నలంద విద్యాసంస్థల చైర్మన్ ఎ.విజయ బాబు అభినందించారు.

రేపు చిత్రలేఖనం పోటీలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి. విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 2వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు పర్యావరణ పరిరక్షణ అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫోరంఫర్ ఆర్టిస్ట్ బాధ్యుడు ఎ.సునీల్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎం.బి.విజ్ఞాన కేంద్రం, ఫోరంఫర్ ఆర్టిస్ట్, వన్ ఎర్త్ వన్ లైఫ్ సంయుక్త ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. సబ్ జూనియర్స్ కేటగిరీలో 3, 4, 5 తరగతులకు, జూనియర్స్ కేటగిరీలో 6, 7 తరగతులకు, సీనియర్స్ కేటగిరీలో 8, 9, 10 తరగతులకు పోటీలు జరుగుతాయని తెలిపారు. పేర్లు నమోదు చేసుకున్న విద్యార్థులు మాత్రమే పోటీలకు అర్హులని పేర్కొన్నారు. డ్రాయింగ్ షీట్స్ మాత్రమే ఇస్తారని, మిగిలిన మెటీరియల్‌ను విద్యార్థులే తెచ్చుకోవాలని తెలిపారు. పోటీల అనంతరం విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లను, పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్ అందజేస్తామని పేర్కొన్నారు.

బీఓఐ 666 రోజుల స్థిర డిపాజిట్ పథకం

మధురానగర్(విజయవాడసెంట్రల్): వినియోగదారుల సౌకర్యార్థం బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్తగా 666 రోజుల స్థిర డిపాజిట్ పథకం ప్రారంభించినట్లు బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ జోనల్ మేనేజర్ ఎంవీ బంగార్రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని ద్వారా డిపాజిట్ చేసిన సూపర్ సీనియర్ సిటిజన్లకు ఏడాదికి 7.95 శాతం, సీనియర్ సిటిజన్లకు7.80 శాతం, సాధారణ వ్యక్తులకు 7.30 శాతం వడ్డీ ఇవ్వనున్నట్లు వివరించారు. '666 డేస్ – ఫిక్స్‌డ్ డిపాజిట్' లో రూ. 2 కోట్ల వరకు డిపాజిట్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ పథకం ఒకటో తేదీ నుంచి అమలులోకి వస్తుందని, ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై లోన్, అకాల విత్‌డ్రా సౌకర్యం అందుబాటులో ఉందని వివరించారు. ఈ డిపాజిట్ కోసం వినియోగదారులు ఏదైనా బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో స్వయంగా గానీ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఓమ్ని నియో యాప్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవచ్చని ఆయన తెలిపారు.

ఉద్యోగ విరమణ చేసిన పోలీసు సిబ్బందికి ఆత్మీయ వీడ్కోలు



విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు విశిష్ట సేవలందించి శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన 17 మంది సిబ్బందికి పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఎస్ఐలు ఇ.కుచేలరావు, ఎస్.కె.కరీముల్లా, ఎస్.వి.ఎస్.రామారావు, ఎ.శ్రీనివాసరావు, ఎం.వెంకటేశ్వరరావు, ఏఎస్ఐలు సి.హెచ్. రంగారావు, ఎం.వెంకటేశ్వరరావు, చలం, ఎస్.కె.అన్వర్ బాషా, వై.ఆర్.వి.వి.సుబ్బారావు, హెడ్‌కానిస్టేబుల్ బి.లక్ష్మణరావు, కానిస్టేబుల్ బి.వి.రామయ్య, హోంగార్డులు జె.ఆశీర్వాదం, ఎ.మధుసూదనరావు, పి.లక్ష్మి, ఎన్.రుపావతి, కె.సరోజినిని కమిషనరేట్ కార్యాలయం వద్ద శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అడ్మిన్ డీసీపీ కృష్ణమూర్తినాయుడు,ఏడీసీపీ కనకరాజు, కార్యాలయ ఏవో రంగారావు, పోలీస్ అధికారుల సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత యోగా శిక్షణ శిబిరం

పెనమలూరు: శ్రీవెంకటేశ్వర యోగా సేవా కేంద్ర ఆధ్వర్యంలో ఉచిత యోగ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సేవా సంస్థ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం వివరాలు తెలుపుతూ శ్రీవెంకటేశ్వర యోగి గురూజీ ఆధ్వర్యంలో జూన్ 2 నుంచి 28 రోజుల పాటు ఉచిత యోగా శిక్షణ ఉంటుందన్నారు. పెనమలూరు సెంటర్ కిలారు అనీల్ ఎస్టేట్‌లో ఉదయం ఐదు నుంచి ఏడు గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 9133306804 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పెనమలూరు: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం కానూరు అశోక్‌నగర్‌లోని తమ కార్యాలయంలో ఉచిత మోకాళ్ల నొప్పుల చికిత్స చేస్తామని యోగాశక్తి సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మాకాల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మోకాళ్ల నొప్పులు, ఎవరికి వారు చికిత్స చేసుకునే విధానంపై అవగాహన కలిస్తామని అన్నారు. మరిన్ని వివరాలకు 9000347369 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అదుపులోనే డయేరియా

ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యా శాఖాధికారి సుహాసిని



నీటి శాంపిల్స్ పరిశీలిస్తున్న అదనపు కమిషనర్ మహేశ్, అధికారులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): డయేరియా అదుపులోనే ఉందని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని చెప్పారు. మొగల్రాజపురం బోయపాటి మాధవరావు వీధిలో శుక్రవారం కూడా వైద్య శిబిరం కొనసాగింది. వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న వారికి శిబిరం వద్ద చికిత్స అందజేశారు. సుహాసిని వైద్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొగల్రాజపురం పరిధిలో కొన్ని రోజులుగా ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేయడంతో 2,574 మంది ప్రజలను కలిసి వారి ఆరోగ్య స్థితిని తెలుసుకున్నామని చెప్పారు. ప్రకాష్ నగర్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని పాయకాపురంలో కూడా వాంతులు, విరేచనాల కేసులు గతంలో నమోదైన దృష్ట్యా అక్కడ కూడా ఇంటింటి సర్వే చేశామన్నారు. 230 ఇళ్లకు తమ వైద్య బృందాలు వెళ్లి సర్వే నిర్వహించాయన్నారు. కొత్త కేసులు శుక్రవారం నమోదు కాలేదని సుహాసిని చెప్పారు. పాయకాపురంలో కూడా వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. విరేచనాలతో బాధపడుతున్న వారికి శిబిరం వద్ద చికిత్స చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించడంతో పాటుగా అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. సురక్షిత మంచినీటి వాడకం, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారని చెప్పారు. జిల్లా డీఎల్ఏటీవో డాక్టర్ ఉషారాణి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, డీపీఎంవో డాక్టర్ నవీన్, జిల్లా ఏపిడిమియాలజిస్ట్ డాక్టర్ స్నేహ సమీర, రాష్ట్ర జిల్లా ఏపిడిమిక్ విభాగం ప్రతినిధులు, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పవన్, ఉస్మాన్, విద్యాసాగర్, రాజ, నరేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తినగర్‌లో డయేరియా లేదు

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రజాశక్తినగర్‌లో డయేరియా లేదని వీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రత్నావళి చెప్పారు. వీఎంసీ అధికారులు శుక్రవారం ప్రజాశక్తినగర్ పరిధిలో నీటి శాంపిల్స్ సేకరించారు. రత్నావళి మాట్లాడుతూ ప్రజాశక్తినగర్‌కు చెందిన చౌదరి కనకమ్మ(70) కొంత కాలంగా ప్రభుత్వాస్పత్రిలో కిడ్నీ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్టు వైద్యులు తెలిపారన్నారు. కనకమ్మ బీపీ, షుగర్ పేషెంట్‌గా చికిత్స పొందుతోందని ఆమె కుటుంబ సభ్యుల ద్వారా తెలుసుకున్నామన్నారు. కనకమ్మ కుటుంబ సభ్యులు అందరూ ఆరోగ్యంగా ఉన్నారని ఎవరికీ విరేచనాలు, వాంతుల్లేవన్నారు. ఆ కుటుంబ సభ్యులు మినరల్ వాటర్ వినియోగిస్తున్నారని చెప్పారు. ప్రజాశక్తినగర్, రాధానగర్ ప్రాంతాల్లో డయేరియాతో బాధపడుతున్న వారు ఎవ్వరూ లేరని పేర్కొన్నారు. ప్రజాశక్తి నగర్ ట్యాంక్ పరిధిలో సరఫరా అవుతున్న నీటి శాంపిల్స్ 11 తీశామని ఆర్సీ కరెక్ట్‌గా ఏదని నీటి సరఫరా విభాగం డీఈ లక్ష్మీ సింధూర తెలిపారు. ప్రజల సమక్షంలోనే శాంపిల్స్ తీశామని నీటిలో ఎలాంటి పొల్యూషన్ లేదన్నారు. అదనపు కమిషనర్ జనరల్ మహేశ్ ప్రజాశక్తి నగర్‌లోని కొన్న డ్రెయిన్లు పరిశీలించి ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూడాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకూడదని శానిటరీ ఎస్ఐని ఆదేశించారు. తాగునీటి శాంపిల్స్‌ను ఆయన పరిశీలించి కలుషితం కాలేదన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్ ప్రభుదాసు ఆ పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ సందర్భంలో స్థానికులు నీరు కొద్దిగా రంగు మారి వస్తున్నాయని అధికారుల దృష్టికి తీసుకురాగా బెడ్‌లో నీటిమట్టం తక్కువగా ఉన్నందున నాచును నిర్మూలించడానికి ఉపయోగించే కెమికల్స్ ప్రభావంతో రంగు మార్పు జరుగుతుంటుందని తెలిపారు.

నైపుణ్యాల పెంపునకే వేసవి శిక్షణ



మాట్లాడుతున్న గుండు దిలీప్

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసి వాటికి మెరుగులు దిద్దేందుకే ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని అన్న సంతర్పణ సమితి అధ్యక్షుడు గుండు దిలీప్ అన్నారు. దుర్గాపురం విజయ్‌నర్సింగ్ కళాశాలలో శుక్రవారం అన్నసంతర్పణ సమితి ఆధ్వర్యాన ఉచిత వేసవి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణ తరగతుల్లో నైపుణ్యం కలిగిన అధ్యాపకులతో నెల రోజుల పాటు ఉచితంగా చిత్రలేఖనం, దస్తూరి, క్లే మౌల్డింగ్ క్రాఫ్ట్ వర్క్, యోగ వెస్టర్న్ డాన్స్, ఫోక్ డ్యాన్స్, భరతనాట్యం తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారన్నారు. ఏటా మరిన్ని కోర్సులతో 500 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలనే సంకల్పంతో పని చేస్తున్నామన్నారు. జూన్ 9న అన్నసంతర్పణ సమితి మూడవ వార్షికోత్సవ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయం హెడ్ మాస్టర్ పుల్లంరాజు, సునీత, గోపా రవి, మాస్టర్ రాజేశ్వరరావు,గోపి తదితరులు పాల్గొన్నారు,

నోటు వేసుకో... నీరు పట్టుకో



కరెన్సీ బాక్సులో పదిరూపాయల కాగితం పెడుతున్న స్థానికుడు



నగదు పెట్టిన తర్వాత వచ్చిన నీటిని పట్టుకుంటున్న వ్యక్తి

రెండు దశాబ్దాల కిందటి వరకు కాయిన్ బాక్స్‌లో రూపాయి కాయిన్ వేసి ఫోన్ మాట్లాడుకునే వాళ్లం. సెల్ ఫోన్‌ల పుణ్యమా అని అవి అదృశ్యమై పోయాయి. ఇప్పుడు కరెన్సీ బాక్స్‌లో పది రూపాయల నోటు వేసి నీరు పట్టుకునే రోజులు వచ్చాయి. విజయవాడ సింగ్ నగర్‌లో వాటర్‌ప్లాంట్ యజమాని ఒకరు ఈ వినూత్న ఆలోచనను ఆచరణలో పెట్టారు. తన ప్లాంట్‌లో నిత్యం మంచినీరు కొనుగోలు చేసే వినియోగదారుల సౌకర్యార్థం వారు ఏ అర్ధరాత్రి, అపరాత్రి నీరు అవసరమైనా సరే తాను అక్కడ ఉన్నా లేకపోయినా ఆ కరెన్సీ బాక్స్‌లో పది రూపాయలు వేసి నీరు పట్టుకునే సౌకర్యం కల్పించారు. బాక్స్‌లో పది రూపాయల నోటు వేయగానే బాక్స్‌లో ఉన్న మిషన్ పక్కనే ఉన్న నీరు సరఫరా చేసే స్విచ్‌కు సిగ్నల్ ఇస్తుంది. వెంటనే సరిగ్గా 20 లీటర్ల నీరు పైపు ద్వారా వచ్చి ఆగిపోతాయి. వినియోగదారుల సౌకర్యార్థం వాటర్ ప్లాంట్ యజమాని చేసిన ఈ ఏర్పాటుపై స్థానికులంతా సలాము చేస్తున్నారు.

– అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్)

తెలుగు సినిమా స్థాయిని చాటిన గొప్ప నటుడు కృష్ణ



సింగ్‌నగర్‌లో కృష్ణ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అభిమానులు



పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న సుధాస్వామి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): తెలుగు సినిమా స్థాయిని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప నటుడు సూపర్‌స్టార్ కృష్ణ అని ఎవర్ గ్రీన్ హీరో కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు దొంతరాజు బాబూరావు అన్నారు. సూపర్‌స్టార్ ఘట్టమనేని కృష్ణ 81వ జయంతి వేడుకలు సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లో శుక్రవారం ఘనంగా జరిగాయి. కాయల నాగమణి ఆధ్వర్యాన జరిగిన వేడుకల్లో ముందుగా కృష్ణ చిత్రపటానికి అభిమానులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేశారు. బాబూరావు మాట్లాడుతూ తెలుగు సినిమాలో ఎప్పటికప్పుడు సరికొత్త పాత్రలను పోషించి, సమాజాన్ని మంచి నడవడికలోకి నడిపించడంలో కృష్ణ నటించిన సినిమాలు ఎంతో దోహదపడతాయన్నారు. నటుడిగా, దర్శకుడిగా, రాజకీయ నాయకుడిగా ఆయన చేసిన సేవలు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. నగరంలో కృష్ణ విగ్రహ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని, కృష్ణ కుమారుడు మహేష్‌బాబు చేతులమీదుగా ఆవిష్కరించడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. అనంతరం స్థానికులకు పండ్లు, కేకులు పంపిణీ చేశారు. బుదాల శ్యాంసన్, బి.పాపారావు, పందిరి కృష్ణ, కృష్ణ మోహన్, చింతా కృష్ణ, లూర్థూ రాజ్ పాల్గొన్నారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సూపర్‌స్టార్ కృష్ణ జయంతి కార్యక్రమాన్ని ఫ్యాన్స్ ఘనంగా నిర్వహించింది. శుక్రవారం లెనిన్ సెంటర్‌లోని సీఆర్డీఏ కార్యాలయ ఎదురు పార్క్‌లో ఆలిండియా సూపర్ స్టార్ కృష్ణ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో కృష్ణ జయంతి సందర్భంగా కేక్ కట్ చేశారు. ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో పేదలకు, మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు. పండ్లు, ఆహార పొట్లాలు, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. ఫ్యాన్స్ సభ్యులు బ్రహ్మం ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షుడు కె. సుధాస్వామి మాట్లాడుతూ చలన చిత్ర పరిశ్రమలో ఎన్నో రికార్డులు, సంచలనాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారన్నారు. కార్యక్రమంలో పాపారావు, కె.విజయ్, రాజు, సాయి, వెంకటేశ్వరరావు, టైలర్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు

గన్నవరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 60 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎ. పద్మావతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన 33 మంది, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన 27 మంది విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చినట్లు పేర్కొన్నారు. వీరికి హెచ్ఎల్ మాండో, జీఈ ఏరోస్పేస్, శుబ్రోస్ లిమిటెడ్, రాయల్ ఎన్‌ఫీల్డ్, ఆర్ సెల్లార్ మెటల్ స్టీల్, నిప్పాన్ స్టీల్ ఇండియా, అపోలో టైర్స్ లిమిటెడ్, మేధా సర్వోడ్రైవ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో ఉద్యోగం లభించినట్లు తెలిపారు. విద్యార్థులకు నియామక పత్రాలు కూడా అందజేసినట్లు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను, వీరిని ప్రోత్సహించిన విభాగాధిపతులు, అధ్యాపకులను ఆమె అభినందించారు.

7న దేవదాయ భూముల కౌలు వేలం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి వారి దేవస్థానం భూములు ఈ నెల 7వ తేదీన కౌలు వేలం నిర్వహించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్.అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నున్న గ్రామానికి చెందిన ఆర్ఎస్.నంబర్ 607/2, 574/2లో ఎకరం 30 సెంట్ల మాగాణి భూమికి 2024–25 నుంచి 2026–27వ సంవత్సరం వరకు టెండర్ కమ్ బహిరంగ వేలం ఆలయ ప్రాంగణం వద్ద నిర్వహించబడునని పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు ప్రథమ ధరావత్తు రూ. 5వేలు చెల్లించాల్సి ఉంది. ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని ఈఓ సూచించారు.

దాసాంజనేయుడికి ప్రత్యేక పూజలు



దాసాంజనేయ ఆలయానికి విద్యుత్ అలంకరణ



హారతి ఇస్తున్న అర్చకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం శ్రీదాసాంజనేయస్వామి దేవాలయంలో హనుమజ్జయంతి వేడుకలు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఆలయ అర్చకులు స్వామి వారికి విశేషంగా పంచామృత స్నపనం, నాగవల్లీదళ సహస్ర నామార్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నేడు హనుమజ్జయంతి

హనుమజ్జయంతి వేడుకలకు సర్వం సిద్ధం చేసినట్లు ఈఓ నాగినేని భవాని తెలిపారు. శనివారం తెల్లవారుజామున 5 గంటల నుంచి నాగవల్లీదళ, సిందూర పూజలు జరుగుతాయన్నారు. రామలింగేశ్వరపేట శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో శనివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించటానికి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ ధర్మకర్త తాన్న పూర్ణచంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు.

ముగిసిన మజ్జిగ పంపిణీ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ ఆలయం ఆధ్వర్యంలో వేసవి కాలాన్ని పురస్కరించుకుని గత మూడు నెలలుగా చేపట్టిన ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రం శుక్రవారంతో ముగిసింది. ఈ వేసవిలో ప్రయాణికులు, బాటసారుల దాహార్తిని తీర్చడానికి ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో చివరి రోజు దాతలు వంగవీటి హరీష్, వంగవీటి హారిక, వంగవీటి రిషిక సహకారంతో మజ్జిగను పంపిణీ చేశారు.

మహిళాభ్యున్నతికి పాటుపడాలి



సభను ప్రారంభిస్తున్న కేబీఎన్ అధ్యక్షుడు ఉసిరిక ఉమామహేశ్వరరావు



హాజరైన మహిళలు, చిన్నారులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహిళాభ్యున్నతికి పాటుపడాలని కాకరపర్తి భావనారాయణ కళాశాల అధ్యక్షుడు ఉసిరిక ఉమామహేశ్వరరావు అన్నారు. కేబీఎన్ కళాశాల యూజీసీ ఉమన్ స్టడీ సెంటర్, క్రీడా విభాగం, పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో వేసవిని పురస్కరించుకొని మహిళలు, చిన్నారులకు నిర్వహించిన ఉచిత శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం శుక్రవారం ఆ కళాశాల ప్రాంగణంలో జరిగింది. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేబీఎన్ కళాశాల ఆరు దశాబ్దాలుగా ఉన్నత విద్యారంగానికి, సామాజిక వికాసానికి పాటుపడుతోందన్నారు. సమాజంలోని మహిళల వికాసానికి అండగా ఉంటుందని వివరించారు. ఆత్మస్థైర్యంతో ముందుకు సాగే ప్రతి మహిళా అద్భుతమైన విజయాలను సాధిస్తారని తెలిపారు. మహిళలు నేర్చుకున్న అంశాలకు సంబంధించి ఏర్పాటు చేసిన ప్రదర్శనలో చాలా చక్కని ప్రతిభను కనబరిచారన్నారు. కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి జల్లూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ వేసవి శిక్షణ తరగతులను మహిళలు ఇష్టంగా ఉత్సాహంగా నేర్చుకోవడం ఆనందంగా ఉందన్నారు. జూనియర్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శశికళ మాట్లాడుతూ ఇలాంటి ముందడుగు మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని కలిగిస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ శిక్షణ శిబిరంలో 15 అంశాల్లో మహిళలకు పది అంశాల్లో చిన్నారులు పాల్గొన్నారన్నారు. సుమారు 2500 మంది మహిళలు, చిన్నారులు ఉచిత శిక్షణ తరగతులకు హాజరయ్యారన్నారు. ఐదేళ్ల చిన్నారి నుంచి 50 సంవత్సరాల మహిళల వరకూ తరగతులను సద్వినియోగం చేసుకున్నారని వివరించారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకురాలు డాక్టర్ సుభాషిణి, ఐక్యూఏసీ కన్వీనర్ డాక్టర్ కృష్ణవేణి, ఉమన్ స్టడీ సెంటర్ కన్వీనర్ శైలజ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న మహిళలు, చిన్నారులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతికాంశాలు ఆకట్టుకున్నాయి.

పొగాకు ఉత్పత్తులతో శారీరక రుగ్మతలు

మానసిక వైద్యురాలు మానస



ఐజీఎం స్టేడియం వద్ద పొగాకు వ్యతిరేక దినోత్సవం ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

లబ్బీపేట(విజయవాడతూర్పు): పొగాకు ఉత్పత్తుల వాడకంతో అనేక మానసిక శారీరక రుగ్మతలు వ్యాపిస్తున్నట్లు ప్రముఖ మానసిక నిపుణులు మానస కాజ అన్నారు. ప్రపంచ నో టుబాకో డే పురస్కరించుకుని శుక్రవారం ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద వాకర్స్ అసోసియేషన్, మానస హాస్పటల్స్ సంయుక్తంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా పొగాకు ఉత్పత్తులతో కలిగే దుష్ఫలితాలపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మానస మాట్లాడుతూ పొగతాగే వారు, పొగాకు నమిలేవారు 30 నుంచి 40 శాతం వరకూ ఉన్నట్లు పేర్కొన్నారు. పొగాకులోని నికోటిన్ మెదడులోని నికోటిన్ రిసెప్టార్స్ ద్వారా దాని ప్రభావం శరీరంపై, మెదడుపై చూపిస్తుందన్నారు. ఒక్కో సిగరెట్‌లో 0.5 మిల్లీగ్రాముల నికోటిన్ ఉంటుందన్నారు. 60 మిల్లీ గ్రాముల నికోటిన్ మనిషికి ప్రాణాంతకమైనదిగా పేర్కొన్నారు. ధూమపానంతో నోరు, గొంతు క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, ఊపిరితిత్తుల్లోని గాలి గదులు ఎలాస్టిక్ గుణాన్ని కోల్పోవడం, క్రానిక్ బ్రోంకైటిస్, గుండె జబ్బులు, పక్షవాతం, పెప్టిక్ అల్సర్, బర్జర్స్ డిసీజ్ అనే రక్తనాళాలకు సంబంధించిన వ్యాధులు సోకుతాయన్నారు. పొగాకు ఉత్పత్తులకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మానసిక వైద్యులు డాక్టర్ ఆర్‌కే అయోధ్య, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సూరె పవన్‌కుమార్, పలువురు వాకర్స్ పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులకు స్వస్తి చెబుదాం.. ఆరోగ్యంగా ఉందాం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పొగాకు ఉత్పత్తులకు స్వస్తి చెప్పి ఆరోగ్యం ఉందామని నవజీవన్ బాలభవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ ఎస్.రత్నకుమార్ చెప్పారు. నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో స్థానిక నిమ్మతోట సెంటర్‌లో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రిలయన్స్ స్మార్ట్ ఆవరణలో సంతకాల సేకరణ, పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. రత్నకుమార్ హాజరై పొగాకు వినియోగానికి నేను వ్యతిరేకిని అని మొదటి సంతకం చేశారు. అనంతరం నవజీవన్ బాల భవన్ ప్రోగ్రామ్ మేనేజర్ గోళ్ళమూడి శేఖర్‌బాబు మాట్లాడుతూ పొగాకు వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలపై పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయడం వల్ల ఇతరులకు ఇబ్బంది కలుగుతుందన్నారు. నవజీవన్ బాలభవన్ ప్రోగ్రామ్ మేనేజర్ వసంత కుమారి మాట్లాడుతూ పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా జరుగుతున్న కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. సంతకాల సేకరణ అనంతరం పొగాకు వినియోగంతో కలిగే దుష్ఫలితాలను వివరిస్తూ ముద్రించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. రిలయన్స్ స్మార్ట్ సిబ్బందితో పాటుగా నవజీవన్ బాలభవన్ సిబ్బంది పాల్గొన్నారు.

మరో పదేళ్లు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్

రౌండ్‌టేబుల్ సమావేశంలో తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న ఆయా సంఘాల ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): హైదరాబాద్‌ను మరో పదేళ్ల పాటు ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలని రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం సామాజిక సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఉమ్మడి రాజధాని అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. వక్తలు మాట్లాడుతూ 2024 జూన్ 2వ తేదీతో హైదరాబాద్ ఉమ్మడి రాజధాని గడువు ముగుస్తోందన్నారు. దీనిపై సమీక్షించి మరో పదేళ్లు హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. ఉమ్మడి రాజధాని కోల్పోతే ఈ విద్యా సంవత్సరంలో రాష్ట్ర విద్యార్థులు తమ కోటాను కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్రానికి రావాల్సిన ఆస్తుల వ్యవహారం తేల్చాల్సి ఉందన్నారు. సమావేశంలో జై ఆంధ్ర డెమాక్రెటిక్ ఫోరం ప్రతినిధులు మేడా శ్రీనివాస్, కె.వినఅవధానుల హరి, కాంగ్రెస్ నేతలు షేక్ బాజీ, ప్రొఫెషనల్ ఫోరం అధ్యక్షులు నేతి మహేశ్వరరావు, దళిత బహుజన ఫ్రంట్ ప్రతినిధులు పొందుగల ప్రకాష్, కోసనం రాము, చంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సహకరించాలి



మధురానగర్(విజయవాడ సెంట్రల్): కౌంటింగ్ రోజు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. ముందస్తు భద్రత ఏర్పాటులో భాగంగా శుక్రవారం గుణదల పోలీసులు ఊర్మిళానగర్ లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ వాసిరెడ్డి శ్రీను పర్యవేక్షణలో మూడు పోలీసు బృందాలు ఊర్మిళానగర్‌లో విస్తృతంగా తనిఖీలు చేశారు. కార్డన్‌సెర్చ్‌లో భాగంగా ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేని 2 ద్విచక్ర వాహనాలు గుర్తించి వాటిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ వాసిరెడ్డి శ్రీను మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్, సెక్షన్ 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉందని, అభ్యర్థులపై పందేలు కట్టినా, కౌంటింగ్ రోజు అల్లర్లు సృష్టించినా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ రోజు పోలీసులకు ప్రజలు ఎలా సహకరించారో.. కౌంటింగ్ రోజు కూడా అలాగే సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్డన్‌సెర్చ్‌లో ఎస్ఐ ఐ.వెంకట్రావు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.